

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## వరద బాధితులకు వేమిరెడ్డి దంపతుల బారి విరాళం



**కోవూరు , సెప్టెంబర్ 3 ప్రభాతవార్త** : నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు వరద బాధితులను తమవంతుగా ఆదుకునేందుకు మంగళవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కోటి రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వేమిరెడ్డి దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల వచ్చిన వరదల్లో విజయవాడ పరిసర ప్రాంతాలు తీవ్రంగా నష్టపోయి వేలాది మంది ఇబ్బందులు పడ్డారని, అటువంటి వారిని తమవంతుగా ఆదుకునేందుకు ఈ విరాళాన్ని ముఖ్యమంత్రికి అందజేయడం జరిగిందని వేమిరెడ్డి దంపతులు పేర్కొన్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ ప్రాంతంలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించడం అభినందనీయమన్నారు. ఇటువంటి విపత్తు నుంచి ప్రజలు త్వరగా బయట పడాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, తదితరులు ఉన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి జగన్‌లో ఎమ్మెల్సీచంద్రశేఖర్‌రెడ్డి భేటీ



**నెల్లూరు,సెప్టెంబరు3 ప్రభాతవార్త-విద య** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డితో మంగళవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబందించిన పలు రాజకీయ అంశాలపై ఇరువురు చర్చించుకునట్లు సమాచారం. అలాగే వైకాపా పార్టీకి చెందిన నెల్లూరు కార్పొరేషన్ కార్పొరేటర్స్ పార్టీ మారుటుండటంపై కూడా చర్చించారు. దీనిని వెంటనే అట్టుకట్ట వేయ్యాలని జగన్ ఎమ్మెల్సీ కి సూచించారు. అలాగే భవిష్యత్‌లో అనుసరించాల్సిన విధి విదానాలపై కూడా జగన్ క్లారిటీ ఇచ్చినట్టు సమాచారం

## వరద బాధితులకు 10 లక్షల రూపాయిలు విరాళం ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



**కావలి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త** ఇటీవల కురుస్తున్న వర్షాలతో సంభవించిన వరదలతో తల్లడిల్లిన బాధితులను ఆదుకునేందుకు వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పది లక్షల రూపాయల విరాళాన్ని మంగళవారం ప్రకటించారు. ఈ విరాళాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి పంపుతున్నట్లు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి వరద బాధితుల్ని అన్ని విధాల ఆదుకోవాలని ఆయన కోరారు. విదేశాలలో వున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఆంధ్ర రాష్ట్రంలో సంభవించిన వరద దృశ్యాలను చూసి చలించిపోయానన్నారు. వరద బాధితుల సహాయార్థం తనవంతు కర్తవ్యంగా పది లక్షల రూపాయలు విరాళాన్ని జగనన్నకు పంపుతున్నట్లు తెలిపారు.

## గణేష్ నిమజ్జనానికి భద్రతా పరంగా పటిష్ట చర్యలు



**నెల్లూరు క్రైం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త** స్థానిక ఇరుకళమ్మ పరమేశ్వరి దేవస్థానం సమీపంలోని గణేష్ ఘాట్ వద్ద ఏర్పాట్లను జిల్లా ఎస్పి జి. కృష్ణ కాంతి మంగళవారం పరిశీలించారు. గత సంవత్సరం నిమజ్జనం జరిగిన సమయంలో పరి స్థితులు, లోటుపాట్లుపై అధికారుల కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనం ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు ఉత్సవ కమిటీల నిర్వాహకులు, శాంతి కమిటీలు సంయుక్తంగా పోలీసు వారి నియమనిబంధనలు తప్పక పాటించాలని, నిర్దేశిత ప్రదేశాలు, సమయాల్లోనే నిమజ్జనాలు పూర్తి చేయాలని కోరారు. ట్రాఫిక్ అంతరాయాలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ట్రాఫిక్ డైవర్షన్ పై సమీక్షించి వెల్లడిస్తామన్నారు. వినాయక ప్రతిమల ఊరేగింపు మొదలు, నిమజ్జనం పూర్తి అయ్యే వరకు అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టౌన్ డిఎస్పి శ్రీనివాసులు రెడ్డి, చిన్న బజార్ సిఐ చిట్టెం కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్ కలిసిన కందుకూరు సబ్ కలెక్టర్



**నెల్లూరు కార్పొరేషన్,సెప్టెంబర్ 3,ప్రభాతవార్త:** కందుకూరు సబ్ కలెక్టర్ గా నూతనంగా ప్రభుత్వం నియమించిన తిరుమని శ్రీ పూజ మంగళవారం నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో కమిషనర్ సూర్య తేజ ను మర్యాదపూర్వకంగా కలిసారు.

## పూర్వస్థితికి వచ్చేంతవరకు వరద సహాయక చర్యలు



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 3, ప్రభాత వార్త:** వరద ముంపుతో జల దిగ్బంబానికి గురైన విజయవాడ ప్రాంతం పూర్వ స్థితికి వచ్చేంతవరకు నెల్లూరు నగర పాలక సంస్థ నుంచి సహాయక చర్యలను కొనసాగిస్తామని కమిషనర్ సూర్యతేజ తెలియజేశారు. వరద బాధితుల సహాయార్థం నగరంలోని షాదీమంజిల్,ఏ.సి నగర్,కొండాయ పాలెం,ఇస్కాన్ టెంపుల్ హనుమాన్ జంక్షన్ కేటరింగ్ కేంద్రాల్లో సిద్ధం చేస్తున్న ఆహార పదార్థాల నాణ్యత,పరిమాణాలను కమిషనర్ మంగళవారం తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు చంద్రబాబు నాయుడు,పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణల ఆదేశాల మేరకు వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతిరోజూ అల్పాహారం 50 వేల ప్యాకెట్లు,మధ్యాహ్న భోజనం లక్ష ప్యాకెట్లు,రాత్రి భోజనం లక్ష ప్యాకెట్లను సంసిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఆహార పదార్థాల తయారీ, ప్యాకివగ్ రవాణా తదితర పనులకోసం ప్రత్యేక సిబ్బందిని నియమించుకుని నిరంతరం పనులు జరిగేలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. విజయవాడలో వరద ప్రభావం పూర్తిగా తొలిగిపోయి,నగరం పూర్తిస్థితికి వచ్చేంతవరకు సేవలు అందించేందుకు నెల్లూరు నగర పాలక సంస్థ అధికారులు,సిబ్బంది కృషి చేయనున్నారని కమిషనర్ వెల్లడించారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



**వింజమూరు,సెప్టెంబర్3ప్రభాతవార్త** : వింజమూరు మండలం శంఖవరం గ్రామ సమీపం లో రోడ్డుప్రమాదంలో గుండెమడకలకు చెందిన వేములపాటి మహేష్ గత నెలలో మృతి చెందాడు. ఆ కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గుండెమడకలకు వెళ్ళి పరామర్శించి ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గాలి నరసపనాయుడు, గాలి రామ్మోహన్‌నాయుడు, శ్రీనివాసులునాయుడు , కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మాలేపాటి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌టిల ఆర్థిక పరిపుష్టికి ప్రాధాన్యత

### ట్రైబల్ వెల్ఫేర్ సభ్ ప్లాన్‌ను పక్కాగా అమలు చేయాలి : కలెక్టర్ ఓ ఆనంద్



**నెల్లూరు అర్బన్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త** జిల్లాలో 2024 - 25 ట్రైబల్ వెల్ఫేర్ సబ్ ప్లాన్‌ను పక్కాగా అమలు చేసేందుకు ఆయా శాఖల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ట్రైబల్ వెల్ఫేర్ సబ్ ప్లాన్ అమలుకు శాఖల వారీగా పొందుపరచాల్సిన నివేదికపై కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌టిల పరిపుష్టి కోసం ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఆయా శాఖల్లో కేటాయింపులు చేయాలని సూచించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఎస్టీలకు హెబిటేషన్లలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారిస్తూ ఎస్‌టిల ఆర్థిక బలోపేతానికి చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లు, ఇళ్ల నిర్మాణాలు, తాగునీరు, విద్య, ఉపాధి కల్పన మొదలైన అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రధానంగా డ్వామా, డిఆర్‌డిఎ, ఆర్ డబ్ల్యూఎస్, పిఆర్, ఆర్‌అండ్‌బి, పశు సంవర్ధక, వ్యవసాయ, ఉద్యావన శాఖ, ఐసిడిఎస్ శాఖల ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాల్లో ఎస్టీలకు అధికంగా ప్రయోజనం కల్పించేలా సబ్ ప్లాన్‌ను రూపొందించాలని సూచించారు. ఆయాశాఖల్లో కేటాయింపులతో పాటు ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంటు ద్వారా మంజూరు చేసిన కేటాయింపులతో పాటు ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంటు ద్వారా మంజూరు చేసిన కేటాయింపులతో ఎస్టీల ఆర్థిక స్వావలంబనకు కృషి చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. మూడు రోజుల్లో ట్రైబల్ వెల్ఫేర్ సబ్ ప్లాన్‌కు సంబంధించిన కేటాయింపుల నివేదికను తయారు చేసి ఐటీడీఏ అధికారులకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటిడిఎ పివో పరిమళ, జడ్పి సిఇవో కన్నమనాయుడు, డిఆర్‌డిఎ, డ్వామా, ఐసిడిఎస్, హౌసింగ్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్లు సాంబశివారెడ్డి, శ్రీనివాసులు, దయాకర్, రవీంద్ర, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, ఉద్యానవన శాఖాధికారి సుబ్బారెడ్డి, డిఎంఅండ్‌హెచ్ ఓ పెంచలయ్య, ఆర్‌అండ్‌బి, విద్యుత్ శాఖ ఎస్ఈలు గంగాధర్, విజయన్, సిపివో రాజు, డిఈవో రామారావు, సమగ్ర శిక్ష ఏపిసి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కమిషనర్ పిలుపు



**నెల్లూరు కార్పొరేషన్,సెప్టెంబర్ 3,ప్రభాతవార్త:** భారీ వర్షాల కారణంగా వరద ముంపుకు గురైన విజయవాడ బాధితులను ఆదుకోవడంలో నెల్లూరు ప్రజలు భాగస్వామ్యులు కావాలని,మౌలిక సదుపాయాలను కల్పించడంలో తమ,తమ సహాయార్థం చూపాలని కమిషనర్ సూర్యతేజ ఆకాంక్షించారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం 55 వేల అల్పాహార ప్యాకెట్లను నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి ప్రత్యేక వాహనాల్లో మంగళవారం తెల్లవారుజామున తరలించారు. విజయవాడ బయలుదేరిన 9 వాహనాలకు కమిషనర్ జెండా ఊపారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణల ఆదేశాల మేరకు వరద సహాయక చర్యల్లో భాగంగా భోజన ప్యాకెట్లను సిద్ధం చేసి తరలిస్తున్నామని తెలిపారు. సహాయక చర్యలను చేపట్టేందుకు గత రాత్రి అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహజంచి యుద్ధ ప్రాతిపదికన యాక్షన్ ప్లాన్ అమలు చేశామని తెలిపారు. హోటల్స్ అసోసియేషన్లు, కేటరింగ్ బృందాలు సహకారంతో లక్ష మందికి మధ్యాహ్నం భోజనం,మరో లక్ష మందికి రాత్రి భోజనాలను సిద్ధం చేసి తరలించనున్నామని కమిషనర్ వెల్లడించారు.

**కార్పొరేషన్ లో ప్రత్యేక కౌంటర్ :** వరద బాధితుల సహాయార్థం నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయనున్నామని,సర్వం కోల్పోయిన వారిని ఆదుకునేందుకు దుస్తులు,ఇతర సామాగ్రి అందించి తోడ్పడాలని కమిషనర్ సూచించారు. విపత్తు నష్ట నివారణ చర్యలలో భాగంగా ప్రభుత్వ కార్యాచరణతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఆవశ్యకమని,స్వచ్ఛంద సంస్థలు,వస్త్రాల అసోసియేషన్లు,వ్యాపర సంస్థలు,ఇతర విభాగాల దాతలు స్పందించి తమ ఉదారతను చాటుకోవాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శర్మద,డిప్యూటీ కమిషనర్ చెన్నుడు,ఇంజనీరింగ్ ఎస్.ఈ సంపత్ కుమార్,ఈ.ఈ సంజయ్,చంద్రయ్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య,సిటీ ప్లానర్ దేవీ కుమారి,మేనేజర్ ఇనాయతుల్లా,రెవెన్యూ అధికారులు సమద్ శ్రీనివాసులు,రాజేశ్వరి,రెవెన్యూ ఇన్స్పెక్టర్లు,శానిటేషన్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## వైసిపి శ్రేణులు ఆత్మస్థైర్యంతో ముందుకు కదలాలి : మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



**మర్రిపాడు, సెప్టెంబర్3ప్రభాతవార్త:** గ్రామంలోని వైఎస్ఆర్‌సిపి శ్రేణులు ఎన్నికల ఫలితాలను పక్కనెట్టి ఆత్మస్థైర్యంతో ముందుకు కదలాలని ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో తమ స్వగృహంలో మంగళవారం మర్రిపాడు, అనంతసాగరం మండలాలకు సంబంధించి వైసిపి శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో అధికార పార్టీ , ఎన్‌డిఎ కూటమి నేతల నుంచి సమస్యలు ఎదురయితే ధీటుగా సమాధానం చెప్పాలన్నారు. ఏ సమస్య వచ్చినా తాను ముందుంటానని హామీ ఇచ్చారు. భూ సమస్యల పట్ల వైసిపి శ్రేణులు జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లోని వైసిపి నాయకులకు సమస్యలొస్తే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. రెవెన్యూపరమైన సమస్యలుత్పన్నమైనప్పుడు వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసి ఉన్న లీగల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించి తమ కార్యాలయం తరపున తమ కార్యాలయ ప్రతినిధి సుధాకర్‌రెడ్డిని సమన్వయకర్తగా నియమించామన్నారు. ఈకార్యక్రమంలో రెండు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అధికారులు పక్షపాత ధోరణికి పాల్పడితే ప్రైవేటు కేసులు వేస్తాం : మాజీ మంత్రి కాకాణి



**పొదలకూరు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త** రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వైసిపి శ్రేణులను పీడించడం, వేధించడం, కక్ష్య సాధించడమే లక్ష్యంగా పనిచేస్తుందని ఇందుకు అధికారులను ముఖ్యంగా రెవెన్యూ, పోలీసులను పావుగా వాడుకుంటుందని కూటమి చెప్పినట్లు అధికారులు తలలు ఊపి పక్షపాత ధోరణి వ్యవహరిస్తే ప్రైవేటు కేసులు వేస్తామని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి హెచ్చరించారు. ఓ రైతు ఇంటిని అక్రమంగా సోదా చేయడం పట్ల ఆయన ఆ రైతు , వైకాపా నాయకులు, కార్యకర్తలతో కలిసి మంగవారం పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుకు సంబంధించిన భూమి వ్యవహారంలో పొదలకూరు తహశీల్దార్ జోక్యం చేసుకుని దాని మీద పోలీసులను పురమాయించాడని పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బంది వెళ్లి రైతు సాగు చేస్తున్నటువంటి భూమిని ఇతరులకు అప్పచెప్పడానికి ప్రయత్నించారని, రైతుకు సంబంధించిన వారిని పోలీస్ స్టేషన్‌లో గంటల తరబడి కూర్చోబెట్టారని, వారిని దుర్భాషలాడారని, వాళ్ళ మీద దాడి చేశారని పేర్కొన్నారు. దౌర్జన్యకరమైన పరిస్థితులను చస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వంలో మార్పు వస్తుంది ఏమో కొద్ది రోజులు వేచి చూద్దామని గత మూడు మాసాలుగా తాము ఏమీ స్పందించలేదన్నారు. ఒక సీనియర్ సిటిజన్ ఈ ప్రాంతంలో గౌరవ మర్యాదలు కలిగి వ్యక్తి ఇంటికి వెళ్లి ఆయన ఇంట్లో ఫోర్జరీ డాక్యుమెంట్స్ ఉన్నాయని తహశీల్దార్ సర్చ్ వారెంట్ ఇస్తే రెవెన్యూ సిబ్బంది వెళ్లి సోదాలు చేశారని తెలిపారు. తహశీల్దార్‌కు సర్చ్ వారెంట్ జారీ చేసే అధికారం లేదని తెలిపారు. జిల్లా మెజిస్ట్రేట్, సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌లకు మాత్రమే సెర్చ్ వారెంట్ జారీ చేసే అధికారం లేదని తెలిపారు. జిల్లా మెజిస్ట్రేట్, సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్, ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్‌లకు మాత్రమే సెర్చ్ వారెంట్ జారీ చేసే అధికారం ఉందని తెలిపారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని తెలిపారు. తాము ఇచ్చిన ఫిర్యాదు పై పొదలకూరు పోలీసులు కేసు నమోదు చేయని పక్షంలో ప్రైవేట్ కేసు వేస్తామని చెప్పారు. ఖచ్చితంగా న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. దీనికి సంబంధించి ఇప్పటికే అడ్వకేట్‌తో మాట్లాడామని తెలిపారు. దుర్వినియోగానికి పాల్పడిన తహశీల్దార్ పై పోలీసులపై కేసులు వేస్తామని తెలిపారు. అధికారం ఉంది కదా అని విర్రవీగితే చేతులు ముడుచుకొని కూర్చోబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు జడ్పిటిసి తెనాలి నిర్మల, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులు రెడ్డి, మండల వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మధ్యాహ్నం బడి భోజనం కార్యక్రమంలో పౌష్టికాహారం తప్పనిసరి



**నెల్లూరు అర్బన్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త** జిల్లాలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం పాఠశాల విద్యార్థులకు రుచిత సుచిగా ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం కార్యక్రమం అమలుపై మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల తల్లుల కమిటీ చైర్పర్సన్లు, కుకింగ్ ఏజెన్సీలకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం కార్యక్రమంలో 2570 పాఠశాలల్లో 1 లక్ష 66 వేల 56 మంది విద్యార్థులు ప్రతి రోజు మధ్యాహ్న భోజనం తీసుకుంటున్నారన్నారు. మధ్యాహ్నం బడి భోజనం కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. మధ్యాహ్నం బడి భోజనం కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విద్యార్థులకు ఆహార మెనూలో మార్పులు చేయాలని ఆయన సూచించారు. జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థులు కోరిన విధంగా మధ్యాహ్న మధ్యాహ్నం బడి భోజనంలో మార్పులు చేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థులు ఇష్టంగా తినే ఆహారాన్ని అందించడానికి అధికారులు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆయన సూచించారు. పాఠశాల తల్లుల కమిటీ చైర్ పర్సన్‌లు పాఠశాల వాతావరణంలో మార్పులు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్ కుమార్, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కుకింగ్ ఏజెన్సీలు తదితరులు పాల్గొన్నారు

## 7ఏళ్ల బాలుడికి ప్రాణం పోసిన జీజీహెచ్ వైద్యులు



**నెల్లూరు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త-వైద్యం** ఒక చోట కాదు.. రెండు కాదు ఏకంగా ఐదు చోట్ల చేతులు కాళ్లు విరిగిపోయి, తీవ్ర ప్రాణాపాయ స్థితిలో ఉన్న 7 ఏళ్ల బాలుడికి డాక్టర్లు శస్త్రచికిత్సలు చేసి ప్రాణాలు కాపాడిన సంఘటన నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (పెద్దాసుపత్రి)లో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దా నాయక్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోవింద్‌తో కలిసి ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ మస్తాన్‌భాష వివరించారు. నెల్లూరుకు సమీపంలోని రాముడుపాలెం గ్రామంలో రొయ్యలగుంట వద్ద చెంబేటి నాగరాజు, అనిత అనే దళిత దంపతులు కాపలాగా ఉంటున్నారు. గత నెల 8వ తేదీ వారి 7 ఏళ్ల చిన్న బిడ్డ వరుణ్ చాప నెత్తిన పెట్టుకుని ఆడుకుంటూ పొరపాటున రొయ్యలగుంటలో తిరుగుతున్న ఏ రేటర్ ఫ్యాన్‌పై పడిపోయాడు. చాపతో సహా ఆ బిడ్డ రోలింగ్ తిరిగిసాగాడు. సమీపంలో ఉన్న వరుణ్ అక్క సుజన(13) పరుగున వచ్చి బిడ్డను పైకి, కిందకు తిప్పేస్తున్న ఫ్యాన్ స్విచ్ ఆఫ్ చేసింది. చాకు తీసుకుని చుట్టుకుని పోయిన చాపను కోసేసి తమ్ముడిని కిందకు దించింది. ఈ విషయం తెలియక గుడిసెలో ఎరువులు కలుపుకుంటున్న తల్లిదండ్రుల వద్దకు పరుగున వచ్చిన సుజన తమ్ముడికి జరిగిన ప్రమాదం గురించి చెప్పింది. దీంతో ఆఘమేఘాలపై వచ్చి బిడ్డను తీసుకుని నగరంలోని ప్రైవేటు ఆస్పత్రి వద్దకు తల్లిదండ్రులు వచ్చారు. అయితే అనేక చోట్ల ఎముకలు విరిగిపోయి, అంతర్గతంగా రక్తస్రావం అయి ఉండటంతో పాటు చిన్న బిడ్డ కావడం, జనరల్ అనస్థీషియా (పెద్దమత్తు) ఇవ్వాల్సి ఉండటంతో ఆ బిడ్డను ఎవరు చేర్చుకోలేదు. దీంతో బిడ్డను పెద్దాసుపత్రి తీసుకుని వచ్చారు. వారికి ఎలాంటి ఆధార్ కార్డులు గాని, ఆరోగ్యశ్రీ కార్డు కాని లేవు. ఆర్థోపెడిక్ డాక్టర్ మస్తాన్‌భాష ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ బిడ్డను పరిశీలించి పరీక్షలు చేయగా రెండు చేతులతో పాటు, రెండు కాళ్లు 5 చోట్ల విరిగిపోయి ఉండటాన్ని గమణించారు. 5 గంటలకు ఆసుపత్రికి రాగా కేవలం రెండు గంటల్లోనే 20 మంది డాక్టర్లు సిబ్బందితో ఆపరేషన్ టేబుల్ ఎక్కించేశారు. మత్తు డాక్టర్ల బృందం సహకారంతో సింగిల్ బేర్లో 5 గంటలు కష్టపడి ఆ బిడ్డకు ఏక కాలంలో రెండు టీములుగా ఏర్పడి పై భాగంలో ఒక టీమ్, కింది భాగంలో మరో టీమ్ ఆపరేషన్‌ను సక్సెస్ చేశారు. ప్రైవేటు ఆసుపత్రిలో కనీసం లక్షలు ఖర్చు అయ్యే ఆపరేషన్‌ను రూపాయి ఖర్చు లేకుండా చేశామని మస్తాన్ భాష వివరించారు. కోలుకోవడంతో మంగళవారం డిశ్చార్జి చేశారు. తనతో పాటు ఆపరేషన్‌లో డాక్టర్ దివ్య, డాక్టర్ అనిల్; డాక్టర్ రాజు తదితరులతో పాటు ఆనస్థీషియ హెచ్‌డీ డాక్టర్ శ్రీనివాసరావు, నర్సింగ్ సిబ్బంది తదితర 30 మంది సహకారంతో బిడ్డను కాపాడామన్నారు. ఆపరేషన్‌ను విజయవంతం చేసిన డాక్టర్ మస్తాన్ భాష టీంను సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందులు అభినందించారు. డాక్టర్లకు వరుణ్ తల్లి అనిత, తండ్రి నాగరాజులు కన్నీటితో కృతజ్ఞతలు తెలిపారు. పెద్దాసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలున్నాయని, ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

## అర్చకుల జీతాలను 5 వేల నుండి 10 వేలకు పెంచడం హర్షణీయం
### కావలిలో ఆదిశైవ బ్రాహ్మణ అర్చకుల సమావేశం



**కావలి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** ప్రభుత్వం డిడిఎన్ అర్చకుల జీతాలను 5 వేల నుండి 10 వేలకు పెంపుదల చేయడం పట్ల కావలి డివిజన్ ఆదిశైవ బ్రాహ్మణ అర్చకుల నేతలు హర్షం వ్యక్తం చేశారు. కావలి శ్రీ దుర్గాభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి (పాతవూరు శివాలయం) ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఆదిశైవ బ్రాహ్మణ అర్చకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లా ఆదిశైవ బ్రాహ్మణ అర్చక సంఘం అధ్యక్షులు కొండకావూరు శేషగిరిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్లూరు ఫణికుమార్‌శర్మ, కోశాధికారి ముదివర్తి రవికాంత్‌శర్మ, రాష్ట్ర నాయకులు నూతలపాటి సుబ్బయ్యశాస్త్రి, ఎ.ఆర్.శశిధర్‌గురుకుల్, జిల్లా కార్యవర్గ సభ్యులు పణతుల శివకుమార్‌శర్మ, హరిహరనాథ్ శర్మలు పాల్గొని మాట్లాడారు. అలాగే ఎండోమెంట్ దేవాలయల అర్చకుల జీతం 10 వేల నుండి 15 వేలకు పెంపుదల చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. ఆదిశైవ బ్రాహ్మణ అర్చకులకు ప్రభుత్వం అండగా వుంటూ ఆదుకోవాలని కోరారు.

## గండువారిపల్లిలో క్షుద్ర పూజల కలకలం



**అనుమసముద్రంపేట, సెప్టెంబర్3ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండలం పేట మజారా గండువారిపల్లిలో షాజహాన్, రజియా దేగం ఇంట్లో క్షుద్ర పూజల కలకలం రేపాయి. వారం రోజుల నుండి ఒ ఇంటిలో క్షుద్ర పూజలు నిర్వహిస్తున్నారంటూ పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షుద్రపూజలు నిర్వహించిన ఇంట్లో విచారణ జరిపి క్షుద్ర పూజలు నిర్వహిస్తున్న ముగ్గురితోపాటు ఇంటి యజమాని దంపతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమ గ్రామంలో క్షుద్ర పూజలు చేనవారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పోలీసులకు డిమాండ్ చేశారు. క్షుద్ర పూజలు నిర్వహించి పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలో నిమ్మకాయలు , కుంకుమ పూజ సామాగ్రి వేయడంతో పాఠశాల లోపలికి వెళ్ళకుండా విద్యార్థులు, ఉపాధ్యాయులు భయపడుతూ బయటికి వెళ్ళిపోతున్నారు. ఈ ఘటనపై స్థానిక ఎస్‌ఐ ఎ.సైదులు మాట్లాడుతూ ఇటువంటి పూజల వలన స్థానికులు భయాందోళనకు గురికావాల్సి అవసరం లేదని క్షుద్ర పూజలు చేసిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు జరగకుండా చర్యలు చేపడతామన్నారు.

## ఆత్మకూరు సప్లై కెనాల్ మరమ్మత్తులకు నిధులు మంజూరు చేయాలి



**ఆత్మకూరు, సెప్టెంబర్3ప్రభాతవార్త:** ఆత్మకూరు చెరువు సప్లై కెనాల్ మరమ్మత్తులకు నిధులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆత్మకూరు మండల అధ్యక్షుడు పాపిశెట్టి కృష్ణమోహన్, నెల్లూరుజిల్లా రైతు సంఘ ఉపాధ్యక్షుడు కృష్ణప్రసాద్ లు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం గొల్లపల్లి నుండి బొగ్గేరు వాగు నుండి ప్రత్యేకంగా 10మీటర్ల వెడల్పుతో 7.2కిలోమీటర్ల దూరం ఉన్న సప్లై కెనాల్‌ను ఏర్పాటు చేసి ఉన్నారు. సహజ సిద్ధమైన బొగ్గేరు వాగునుండి ఈ ఏర్పాటు చెరువును నిర్మించిన రాయలకాలం నాడే ఏర్పాటు చేశారు. ఆత్మకూరు చెరువు పూర్తిగా ఎండిపోయి ఉంది. నిర్వహణ పూర్తిగా వదిలేసిన పరిస్థితులున్నాయన్నారు. ఆత్మకూరు చెరువు పారుదల కాలువకు ఆనం రామనారాయణరెడ్డి 22లక్షల రూపాయల వెచ్చించి పూడికతీత పనులను చేస్తున్నారు. గతంలో ఆత్మకూరు చెరువు తూముల మరమ్మత్తులను చేసి ఉన్నారని అయితే ఆత్మకూరు చెరువుకు నీరు అందించే ఏటి కాలువ మరమ్మత్తులు చేయలేదని. సుమారు పది అడుగుల ఎత్తున జమ్ము పెరిగి ఉందని,. బొగ్గేరు సాగినప్పటికీ ఈ ఏటి కాలువ నుండి ఆత్మకూరు చెరువుకు నీరు రావడం కష్టమన్నారు. గొల్లపల్లి రైతులు అందించిన సమాచారం మేరకు కొద్దిపాటి నీరు వస్తే ముందుకు సాగక వెనుకకు బొగ్గేరులోకి చేరుతుందన్నారు. 3సంవత్సరాల క్రితం ఈ ఏటి కాలువకు మరమ్మత్తులు చేశారని, వర్షాలు కురవకపోతే ఆత్మకూరు చెరువుకు సోమశిల జలాలు అవసరమవుతాయన్నారు.కొద్దిగా వచ్చే సోమశిల జలాలు ఈ ఏటి కాలువద్వారా ఆత్మకూరు చెరువుకు చేరడం కష్టమన్నారు. పారుదల కాలువలకు నిధులు తెప్పించి పూడికతీత పనులు చేయించిన మంత్రి ఏటి కాలువలో ఉన్న జమ్ముగడ్డి తొలగించకపోతే పారుదల కాలువలకు సాగునీరు అందదన్నారు. ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ను రైతు సంఘం సంప్రదించగా అంచనాలు తయారు చేసి మంజూరుకు పంపి ఉన్నామన్నారు. ఆత్మకూరు చెరువు ఆయకట్టుకింద ఉన్న 6వేల ఎకరాలలు వ్యవసాయానికి ఏటికాలువ మరమ్మత్తులు తప్పనిసరి కావున మంత్రి జోక్యం చేసుకలొని ఆత్మకూరు చెరువు సప్లై కెనాల్ మరమ్మత్తుల కొరకు నిధులు కేటాయించాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో రైతులు జయరామయ్య, ప్రసాద్, రమణయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సహాయక చర్యలకు తరలిన పారిశుధ్య కార్మికులు



విింజమూరు ,సెప్టెంబర్3ప్రభాతవార్త: విజయవాడ వరదప్రాంతాల్లో సహాయక చర్యలకు వింజమూరు పారిశుధ్య సిబ్బంది 15మంది మంగళవారం ప్రత్యేక వాహనంలో తరలి వెళ్ళారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ జిల్లా పాలనాధికారి, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు విజయవాడకు వింజమూరు గ్రామపంచాయతీ నుండి పారిశుధ్యకార్మికులను పంపామన్నారు. ఇకనుండి వారు అక్కడ పారిశుధ్య సహాయక చర్యల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, కాంగ్రెస్‌పార్టీ పిసిసి సభ్యులు మద్దూరు రాజగోపాల్‌రెడ్డి , నల్లగొండ్ల రాయుడు, బువ్వన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి మాదినేని ఆర్థిక సాయం



**వింజమూరు, సెప్టెంబర్ 3ప్రభాతవార్త:** వింజమూరు మండలం ఊటుకూరు ఎస్సీకాలనీకి చెందిన శ్రీపతి శ్రీనివాసులు సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి యువనాయకుడు మాదినేని నాగేశ్వరరావ్ శ్రీపతి శ్రీనివాసులు ఇంటికి వెళ్ళి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థికసాయమందించారు.

## ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయునికి ఘన సన్మానం



**వింజమూరు, సెప్టెంబర్3ప్రభాతవార్త:** వింజమూరు మండలం చవటపల్లి ఎస్సీ కాలనీలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన పి.బాలచెన్నయ్యను వింజమూరు పాతూరు పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. మంగళవారం స్థానిక పాతూరు పాఠశాలలో బాలచెన్నయ్యను ఉపాధ్యాయులు జూపల్లి వెంకటేశ్వర్లు, టి.కొండారెడ్డి, కె.వెంకటసుబ్బయ్య , శైలజ, చంద్ర, దామెర చెంచయ్య, సుజాత, ఆదిలక్ష్మి తదితరులు సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో తమ పాఠశాలలో సహచర ఉపాధ్యాయుడిగా పనిచేశాడని విధినిర్వహణలో నిబద్ధత కలిగిన వాడన్నారు.

## నాయి బ్రాహ్మణులచే సియం చంద్రబాబుకు పాలాభిషేకం



**గోనుపల్లి(రాపూరు),సెప్టంబరు3ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన దేవస్థానం కళ్యాణకట్టకు చెందిన నాయిబ్రహ్మణులు మంగళవారంముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ గత వారంలో జరిగిన రాష్ట దేవాదాయ ధర్మాదాయ శాఖా సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు నాయి బ్రహ్మణులను గుర్తించి దేవాలయాలలో కేశఖండన చేసే నాయి బ్రాహ్మణులకురూ. 25 వేల వేతనంతో పాటు ప్రతి దేవాలయం పాలకమండలిలలో ధర్మకర్తలుగా నాయి బ్రాహ్మణులకు ఒకరికితప్పని సరిగా అవకాశం కల్పించాలని ఆదేశాలు జారీ చేయడం నాయి బ్రాహ్మణుల పట్ల ముఖ్యమంత్రికి వున్నఅభిమానమేనని అన్నారు. ఇందుకు కృతజ్ఞతగా ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించనట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గోనుపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు ఈగా రాజా రెడ్డి, మాజీ ఏయంసీ ఛైర్మన్ కండే రమణయ్య,ఏగిటాల పెద్దబ్బయ్య,మల్లిఖార్జున రెడ్డి,టిడిపి జిల్లా కార్యదర్శి ఈదర శ్రీనివాసులు,నాయి బ్రాహ్మణ సాధికార సమితిజిల్లా కన్వినర్ ఆళ్ళూరి శ్రీహరి, సాధికార సమితి వెంకటగిరి నియోజకవర్గం నాయకులు కోక్కంటి వెంకటేశ్వర్లు,కోక్కంటి మనోజ్ తదితరులున్నారు.

## కలిగిరిలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం.

**కలిగిరి,శెప్టంబర్03, ప్రభాతవార్త ;** కలిగిరిలోని ఆవులశ్రీనివాసులరెడ్డి కల్యాణ మండపంలో గురువారం ఉదయం 11గంటలనుండి ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కార్యక్రమంనిర్వహించడం జరుగుతుందని విద్యుత్‌శాఖకావలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె.యస్. బెనర్జీ ఓ ప్రకటనలో తెలియ జేశారు.కావలి డివిజనల్ పరిదిలోని కావలి, కలిగిరి,అల్లూరు సబ్‌డివిజన్స్‌కు సంభందించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కార్యక్రమం గురువారం కలిగిరిలో నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలోఆంధ్ర ప్రదేశ్‌దక్షిణ ప్రాంత విద్యుత్‌పంపిణీ సంస్థకు చెందినఅధికారులు, మరియు శిబ్బంది హాజరౌతారన్నారు.కావున విద్యుత్ వినియోగ దారులకు పరిష్కారము కాని సమస్యలుఏవైనా ఉంటే వ్రా పూర్వక పిర్యాదుల ద్వారా తెలియ పరచి య వారి సమస్యలను పరిష్కరించుకోవాలని ఎగ్జక్యూటివ్ ఇంజనీరు తెలిపారు.

## విద్యాకార్యక్రమాల అమలుపై శిక్షణ




**మర్రిపాడు, సెప్టెంబర్3ప్రభాతవార్త:**మర్రిపాడు లోని మండల పరిషత్ సమావేశ మందిరంలో విద్యాకార్యక్రమాల అమలుపై మండల విద్యాశాఖాధికారి జ్యోతి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు, వార్డ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎస్ఎంసి చైర్మెన్లు, వైస్‌చైర్మెన్లు, సభ్యులు సమన్వయంతో పనిచేసి విద్యాకార్యక్రమాలను ముందుకు తీసుకు వెళ్ళాలన్నారు. ఈసమావేశంలో మండల రీసోర్స్ పర్సన్ రాజేంద్రకుమార్ పాఠశాల యాజమాన్య కమిటీ బాధ్యతలు, వారు నిర్వహించాల్సిన విధులు, టాయిలెట్లు, మధ్యాహ్న భోజన పథక నిర్వహణ తదితర అంశాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఇఆర్‌డి మస్తాన్‌ఖాన్, మండలంలోని ప్రధానోపాధ్యాయులు , వార్డ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎస్ఎంసి చైర్మెన్లు, సిఎం ఆర్జీలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మానవీయ కోణంలో శక్తివంచన లేకుండా వరద బాధితుల్ని ఆదుకోవాలి



**కావలి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** మానవతా దృక్పదంతో శక్తివంచన లేకుండా వరద బాధితుల్ని ఆదుకోవాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కోరారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు చిత్తశుద్ధితో, అంకితభావంతో బాధితుల్ని ఆదుకోవడంలో ఎంతో తృప్తి వుంటుందన్నారు. విజయవాడ 17వ డివిజన్‌లో అధికారులు, నాయకులు, ఆ పరిధిలోని సచివాలయాల సిబ్బందితో మంగళవారం వరద బాధితుల్ని ఎలా ఆదుకోవాలో అన్న విషయాలపై అవగాహన కల్పించారు. ఈ డివిజన్‌లో ప్రాంతాల వారీగా వరద ముంపు పరిస్థితులు, వరద నీటిని తొలగించేందుకు అవకాశాలు, వరదకు చిక్కుకున్న బాధితుల పరిస్థితి, ఆహారం, మంచినీరు ఎలా అందించాలో అన్న విషయాలపై ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. ఆరోగ్యపరమైన సమస్యలు, వైద్య సేవలు, మహిళలు, చిన్నారులు పడుతున్న అవస్థలపై ఎలా ఆదుకోవాలో అన్న విషయాలపై సమీక్ష నిర్వహించారు. ఇటువంటి సమయంలో ఎంతగానో ప్రజల్ని ఆదుకోవాలన్నారు. తాము అండగా వుంటామన్నారు. ఏ కుటుంబం వరద చిక్కుకొని ఇబ్బందులు పడకూడదన్నారు. ఎటువంటి పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు మన ఎన్డీఏ ప్రభుత్వం వుందన్నారు. అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వయసును సైతం లెక్కచేయకుండా రేయి, పగలు అనే తేడా లేకుండా వరద బాధితులను ఆదుకోవడంలో అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. అందరం సైనికులుగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా పాటుపడదామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కోరారు.

## పోలీసుల అనుమతితో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయాలి




**కావలి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** వినాయక చవితి పర్వదినం సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు పోలీస్ అనుమతి విధిగా పొందాలని కావలి వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ షేక్ ఫిరోజ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. పోలీస్ పర్మిషన్ కోసం లింక్ ద్వారా ఆన్‌లైన్ ఓపెన్ పోర్టల్ నందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన వారికి పోలీస్ స్టేషన్ నుండి ఎంత చలానా కట్టాలో వారి రిజిష్టర్ మొబైల్ నెంబరుకు పేమెంట్ ఐడి వస్తుందన్నారు. ఈ ఐడితో మీసేవకు వెళ్లి పేమెంట్ చెల్లించిన తర్వాత పోలీస్ అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అనుమతి పత్రాన్ని కమిటీ వారు దగ్గర వుంచుకోవాలన్నారు. వినాయక చవితి విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు ఇవన్ని పాటించాలని తెలిపారు.

## దగదర్తి అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు



**దగదర్తి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** దగదర్తి జిసి అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.సౌజన్య మాట్లాడారు. తల్లులు, గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా వుంటారన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్, అంగన్వాడీ టీచర్స్ యం.లక్ష్మీప్రసూన, లక్ష్మీకాంతమ్మ, పి.హేమలత, యు.నాగమ్మ, పి.వేదవతి, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## పౌష్టికాహార మాసోత్సవాలు - తక్కువ ఖర్చుతో పోషకాహారం



**కొడవలూరు సెప్టంబరు 3 ప్రభాతవార్త:** యలాపాలెం గ్రామ పంచాయితీలో జి2 అంగన్వాడీ కేంద్రం నందు మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా పోషకాహారంలోని విలువలు గురించి అంగన్వాడీ సూపర్‌వైజర్ వి.పద్మావతి ప్రీస్కూల్ పిల్లల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె తల్లులకు అనిమీయా (రక్తహీనత) గురించి, మరియు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు గల ఆహారం గురించి తెలియజేశారు. అంతేకాక తల్లులకు చిరుదాన్యతో తయారిచేసిన పదార్థలు ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు మేరి హెప్సిబా, వెల్‌ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున్, వార్డు మెంబరు అబీబున్నీసా, గ్రామస్తులు మరియు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలి



**కోవూరు సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** ఇంటి నిర్మాణం లబ్దిదారులు నిర్మాణాలు వేగవంతం చేసేలా సహకరించాలని గృహనిర్మాణశాఖ ప్రాజక్టు డైరక్టర్ దయాకర్ అన్నారు.కోవూరు మండలం పాటూరు పంచాయితీ గిరిజన కాలనీలో మంగళవారం సాయింత్రం ఆయన గృహనిర్మాణ శాఖ డిఇ వెంకటేశ్వర్లుతో కలిసి లబ్దిదారులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వం ఇస్తున్న ఈ అవకాశాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈకార్యక్రమంలో హౌసింగ్ ఏ.ఇ మాదవయ్య, వర్క్ ఇనస్పెక్టర్లు ఇంజనీర్లు వున్నారు.

## రైతులు బాగుండాలి-ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి



**విడవలూరు,సెప్టెంబర్ 3,ప్రభాతవార్త:** మండలం వరిని పంచాయతీ వీరారెడ్డిపాలెం గ్రామంలో కడిదేవి పూడికతీత కాలువ పనులు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మంగళవారం జెసిబి యంత్రానికి పూజలు చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంటలు సాగు చేసుకుంటూ ఆనందంగా ఉండాలి రైతుల బాగుంటే అందరూ బాగుంటారు.రైతన్నలకు పూడికతీత కలవ పనులు అవసరమైన చోట పనులు సాగించండి ఒక్క రూపాయి కూడా ఎవరు పెట్టుకొని అవసరం లేదు మొత్తం ఖర్చు విపిఆర్ సౌజన్యంతో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.అదే విధంగా ఊటుకూరు పంచాయతీ పురటి కాలువ ఇరిగేషన్ పనులు కూడా సందిర్శంచారు.ఈ కార్యక్రమంలో బెజవాడ వంశీకృష్ణా రెడ్డి ,అడపాల శ్రీధర్ రెడ్డి,పాశం శ్రీహరి రెడ్డి.చెముకుల శ్రీనివాసులు,బెజవాడ గోవర్ధన్ రెడ్డి,దిలీప్ కుమార్,బిజెపి నాయకులు కనుపర్తి నాగేంద్ర,రాజన్న,తాతా బాలకృష్ణ,చెన్నం శెట్టి వెంకటేశ్వర్లు.ఒగు నాగేశ్వరరావు చిన్న వెంకయ్య,సింహాద్రి అయ్యప్ప,ఎస్ కే రఫీ,హిమాని భాష,భాషా ఫౌండేషన్ జనార్దన్, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరి సర్కిల్ ఇన్సెపెక్టర్ గిరిబాబుకు ఘన సన్మానం



**ఉదయగిరి,సెప్టెంబర్ 3,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉదయగిరి లోని ఉదయగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.గిరిబాబును తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రసాద్ ఘనంగా సన్మానించారు.ఆయనకు డిజిపి చిత్రపటాన్ని బహుమతిగా అందించిన ప్రసాద్ మాట్లాడుతూ ఉదయగిరి సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాలలో ప్రజలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా శాంతిని పరిరక్షిస్తూ చట్ట పరిధిలో బాధితులకు న్యాయం చేస్తూ ప్రజల మన్ననలు అందుకున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.గిరిబాబు లాంటి అధికారి చాలా అరుదుగా ఉంటారని అన్నారు.ఆయన గడిచిన మూడు సంవత్సరాలు కాలం నుండి ఉదయగిరి సర్కిల్ పరిధిలో లోనే కాకుండా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఏ మూలనైనా కేసును పరిశోధించి అతి తక్కువ కాలంలో నిందితులను పట్టుకున్న చరిత్ర ఆయినదని కొనియాడారు.పక్షపాతం లేకుండా బడుగు బలహీన వర్గాలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేసిన ఆయనకు మరెన్నో ఉత్తమ పథకాలు వరించాలని రాబోయే రోజుల్లో మంచి పదవులను పొందాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## మిస్సింగ్ కేసుల నివారణకు కార్యాచరణ ప్రణాళికజిల్లా ఎస్పి కృష్ణకాంత్




**నెల్లూరు క్రైం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం మిస్సింగ్, మహిళలపై జరిగే నేరాలు అరికట్టుటకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, జిల్లాలో బాలికలు, మహిళల మిస్సింగ్ కేసులను నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ రూపకల్పన చేయడం జరిగిందని జిల్లా ఎస్పి కృష్ణకాంత్ తెలిపారు. మిస్సింగ్ కేసులపై కళాశాల యాజమాన్యాలతో ఆయన మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కువ సమయం గడుపుతారు కనుక సులభంగా పిల్లలకు చేరుతఉందనే భావనతో కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించామని, యాజమాన్యాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఇంటర్నెట్ ప్రభావం ఎక్కువగా పిల్లలపై ఉంది. అందులో మంచి చెడు, ఏది అవసరం, ఏది అనవసరంను తెలియజేయాలన్నారు. పాఠశాల, కళాశాలల్లో తప్పక సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, లోపల వైపే కాకుండా బయట వైపు, చుట్టుపక్కల 100 మీటర్లు వరకు చూసేలా ఏర్పాటు చేసుకోవాలని, హాస్టల్స్‌లో భద్రత పరంగా కఠినంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను ఎంతో గారాబంగా పెంచిన తరువాత యుక్తవయసులో తప్పిపోతే చాలా బాధపడతారని అందుకే విద్యతో పాటు పిల్లలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. హాస్టల్స్, కళాశాలలోని వచ్చే వారిపై నిఘా ఉంచాలని, వారి కదలికలపై గమనించాలని సూచించారు. ఎటువంటి పనుల వల్ల మనతో పాటు మన కుటఉంబ సభ్యులు అవమానపడతారు అనే విషయాలు, నైతిక విలువలు పిల్లలకు తెలియజేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కాలేజ్‌లలో కమిటీలు ఏర్పాటు చేసి కమిటీలో విద్యార్థులు, అద్యాపకులు, పోలీసు తరపున ఒకరిని భాగస్వామ్యులను చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎపోలీసు అధికారులు, యాజమాన్యాలతో కలిసి విద్యాలయాలు, కళాశాలలో అవగాహన సదస్సులు నిర్వహించాలని, యువతను చైతన్యం పరిచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని వివరించారు. సైబర్ నేరాలు, గంజాయి, మహిళలపై జరిగే నేరాల నిర్మూలన, రోడ్డు ప్రమాదాలు, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం, హెల్మెట్ ధరించడం, డ్రైవింగ్ లైసెన్స్,చట్టాలు, శిక్షలపై అవగాహన కార్యక్రమాలు తరచు నిర్వహించాలన్నారు. పోలీసు శాఖాపరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీను ఇచ్చారు. ఎటువంటి సమస్య ఉన్నా అసౌకర్యానికి గురైనా వెంటనే డయల్ 112 అనే టోల్ ఫ్రీ నంబర్ కానీ స్థానిక పోలీస్ స్టేషన్ అధికారిని గాని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి అడ్మిన్, సౌజన్య, టౌన్ డిఎస్పి శ్రీనివాసులు రెడ్డి, రూరల్ డిఎస్పి శ్రీనివాసరావు, జిల్లా పరిధిలోని కళాశాలలు, పాఠశాలల ప్రతినిదులు పాల్గొన్నారు.

## వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం వైఫల్యం మాజీ మంత్రి కాకాణి



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** గత వారం రోజులుగా వరద ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్న విజయవాడలో ముంపుకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం బాధ్యత రహితంగా వ్యవహరిస్తుందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. నెల్లూరు బైపాస్ రోడ్డులోని ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధిత ప్రాంతాల్లో ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు తీసుకోలేదు అన్నారు. 30 ఏళ్ల రాజకీయ అనుభవం అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు ముందస్తు చర్యలు ఏం తీసుకున్నారు చెప్పాలని ప్రశ్నించారు. వరదలు చిక్కుకుపోయి ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ బతుకుతున్న బాధితులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆయన అన్నారు. రాష్ట్ర మంత్రులు ఫోటోలుకి ఫోజులిస్తున్నారే గాని ఇప్పటికీ బాధితుల్ని ఎలా ఆదుకోవాలో అన్న పాపానా పోవటం లేదని ఆయన అన్నారు. ఇంత విపత్తుతో ప్రజలు అల్లాడిపోతుంటే డిప్యూటీ సిఎం ఏం. చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. వరదలు ఇబ్బంది పడుతున్న బాధితులను మంత్రి స్థానంలో అండగా నిలవాల్సిన నారా లోకేష్ ఎక్కడా కనబడటం లేదని ఆయన అన్నారు. అమరావతి ఏర్పాటు చేసినప్పటి నుండి రియల్ ఎస్టేట్ చేసుకోవడం తప్ప శాశ్వత పరిష్కారంగా ఇప్పటి వరకు చంద్రబాబు అమరావతిలో చేసింది. ఏమీ లేదని ఎద్దేవా చేశారు. వరద బాధితులను సమర్థవంతంగా ఆదుకోలేని ప్రభుత్వం ఏమి చేయాలో తెలియని ప్రస్టేషన్‌లో జగన్మోహన్ రెడ్డిని తిట్టడమే పరమావదిగా పెట్టుకున్నారని తెలిపారు. ప్రజలకు అన్ని గమనిస్తున్నారని జగన్‌మోహన్ రెడ్డి చేసిన మంచి పనులు ఈ రోజు మీ వైఫల్యాలు వల్ల ప్రజలకు తెలుస్తుందని ఆయన అన్నారు.

## పాఠశాల అభివృద్ధి కొరకు పూర్వ విద్యార్థి వితరణ



**కోవూరు , సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి , కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అభిమాని అయిన సీతారామ్ చైతన్య.. ప్రధానోపాధ్యాయిని రాధారాణికి రూ. 15 వేలను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అవసరమైతే మరో కొన్ని నిధులు కూడా పంపిణీ చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా చైతన్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

## పాము కాటుకు వ్యక్తి మృతి

**బిట్రగుంట, సెప్టంబర్3, ప్రభాతవార్త :** బోగోలు మండలం అల్లిముడుగుసంఘం గ్రామానికి చెందిన బచ్చు శంకర్(34)పాముకాటుకు గురై సోమవారం రాత్రి మృతిచెందినట్లు బిట్రగుంటపోలీసులు తెలిపారు. బచ్చు శంకర్ ఆరుబయట నిద్రిస్తుండగ నాగుపాము కాటేసిందని వెంటనేకోవూరుపల్లి పిహెచ్‌సికి తరలించగ పరిస్థితి విషమంగ వుండడంతో కావలి ఏరియా వైద్యశాలకు తరలించేలోగ మృతిచెందాడన్నారు. ఈవిషయిన్ని మృతుడు భార్య సీనమ్మ మంగళవారం బిట్రగుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగ పోలీసులు శవపరీక్ష నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు పేర్కొన్నారు.

## మండలంలో 99.4 శాతం పింఛన్లు పంపిణీ



**కోవూరు , సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని 16 సచివాలయాలకు సంబంధించి 9537 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా.. సోమవారం నాటికి 9480 పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని ఎంపీడీవో శ్రీహరి తెలిపారు. మొత్తం మండలంలో 99.4 శాతం పింఛన్ల పంపిణీ పూర్తిచేయడం జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గ్రామాల్లో గృహ నిర్మాణ శాఖకు సంబంధించి వంద రోజుల ప్రణాలికపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## ఏఎస్ఐ శ్రీనివాసులు సత్కరించిన రామారావు



**ఉదయగిరి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉదయగిరి లోని పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ ఆర్ల శ్రీనివాసులను టిడిపి న్యాయ విభాగ అధ్యక్షులు సంధి రెడ్డి రామారావు ఘనంగా సత్కరించారు. ఉదయగిరి పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆర్ల శ్రీనివాసరావుకు ఎస్సై గా ప్రమోషన్ రావడంతో ఆయనను సత్కరించినట్లు రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్నత అధికారుల సూచనల మేరకు విధులు నిర్వహించి పలు కేసులను పరిష్కరించే విధానంలో తన వంతు కృషిచేసి ఉన్నాతాధికారుల మన్ననలు పొందిన ఏఎస్ఐ శ్రీనివాసులు సబ్ ఇన్స్పెక్టర్గా ఉన్నత పదవిని పొందడం సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. ఆయన ఎక్కడ విధులు నిర్వహించిన నీతి నిజాయితీతో చట్ట పరిధిలో విధులు నిర్వహిస్తారని రాబోయే రోజుల్లో మరింత ఉన్నతమైన పదవులు ఆయనను వరించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడలో శానిటేషన్‌కు బోగోలు మండలటీం



**బిట్రగుంట, సెప్టంబర్3, ప్రభాతవార్తః** రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాదికారుల ఆదేశాలమేరకు విజయవాడలో ముంపుకుగురైన ప్రాంతాల్లో శానిటేషన్‌విధులు నిర్వర్తించేందుకు మండలం నుంచి ఇన్‌చార్జ్ ఇఒపిఆర్‌డి జహీర్‌బాష ఆద్వర్యంలో ఒక పంచాయతి కార్యదర్శి, ఒక ఎలక్ట్రీషియన్, ఒకప్లంబర్, ఇద్దరు శానిటేషన్ సిబ్బంది మంగళవారం బోగోలు నుండి బయలుదేరి వెళ్ళారని ఎంపిడిఒ సుబ్బారావు తెలిపారు.

## దూర విద్యా విధానం పై మండల స్థాయి శిక్షణా కార్యక్రమం



**ఉదయగిరి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:** ఉదయగిరి మండల అభివృద్ధి అధికారిణి ఈశ్వరమ్మ అధ్యక్షతన ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి టు తోట శ్రీనివాసులు గారి ఆధ్వర్యంలో ఉదయగిరి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్/వైస్ చైర్మన్ లకు మరియు మండలంలోని అన్ని పంచాయతీల ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్లకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం, పాఠశాల మరుగుదొడ్ల నిర్వహణ మరియు దూర విద్యా విధానం పై మండల స్థాయి శిక్షణ సమావేశము జరిగినది. ఈ సమావేశం నందు మండలాధికారులు మాట్లాడుతూ ప్రతి సోమవారం, గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ లేదా వైస్ చైర్మన్ పాఠశాల యొక్క మరుగుదొడ్ల నిర్వాహణను మరియు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనమును పరిశీలించి ఐఎమ్ఎమ్ఎస్ యాప్ నందు ఫోటోలు అప్లోడ్ చేయవలెనని అదే విధంగా ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు తమ సచివాలయ పరిధిలోని అన్ని పాఠశాలల ముందు మధ్యాహ్న భోజనం మరియు మరుగదొడ్ల నిర్వాహణను పరిశీలించి ఫోటోలు అప్లోడ్ చేయవలెనని సూచించారు. తదుపరి దూర విద్యా విధానం గురించి తెలియజేస్తూ విద్యార్హతతో సంబంధం లేకుండా యువతి యువకులు తమ వయసును బట్టి పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ పరీక్షలు రాయవచ్చు అని ఒకవేళ ఫెయిల్ అయినప్పటికీ ఐదు సంవత్సరాలలోపు 9 సార్లు పరీక్షలు రాయవచ్చు అని చదవడం రాయడం తెలిసిన యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ /వైస్ చైర్మన్లు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, సి ఆర్ఎంటిలు పాల్గొన్నారు.

## నిత్యావసరధరలు తగ్గించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం




**కలిగిరి, శెప్టంబర్03, ప్రభాతవార్త;** మోడీపాలనలో అధికధరలో ప్రజలు అల్లాడుతున్నారని కనీస నిత్యావసర ధరలు సైతం ఆకాశాన్నంటి పేదవాని నడ్డి విరుస్తున్నాయని పెంచిన నిత్యావసర ధరలు వెంటనే తగ్గించకపోతే సిపిఐ ఆద్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఐజిల్లా సీనియర్ నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం కలిగిరిలోని కలిగిరమ్మ సెంటరులో సిపిఐ ఆద్వర్యంలో దర్నా కార్యక్రమం నిర్వహించారు. ,ఈసందర్భంగా పెంచిన డీజల్ ,పెట్రోలు ధరలు వెంటనే తగ్గించాలని, పెంచిన నిత్యావసరాల ధరలు తగ్గించాలని, రైతులకుగిట్టుబాటుదరలు కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మోడీ పాలన చేపట్టిన నాటినుండి దేశంలో ధరలు ఆకాశాన్నంటినాయన్నారు. రోజురోజుకూ డీజల్, పెట్రోలు ధరలు పెరిగిపోతున్నాయన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించక పోవడంతో రైతులు ఉద్యమాలు చేస్తున్నా వారి భాదలుపట్టించుకోవడంలేదు. మద్యతరగతి, పేద ప్రజలుకు నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి కొనలేని పరిస్తితిలో ఉన్నారన్నారు. సామాన్యులకు అవసరమైన నిత్యావసరాలు ధరలు వెంటనే తగ్గించాలని పెంచిన పెట్రోల్‌డీజల ధరలను తగ్గించాలని, రైతులకు గిట్టుబాటు దరలు కల్పించాలని, రైతు సోదరులకు ఉచిత విధ్యుత్ అందజేయాలనివారు డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి ఆనంద్, సిపిఐ నాయకులు దమ్ముదర్గా బాబు, గోసాల రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వరసిద్ధి వినాయక పూజలు



**కోవూరు , సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో స్వామివారి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రాత: కాల మునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు పరాం కుశం రాఘవాచార్యులు, పరాంకుశం శ్రీకాంతా చార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయ బద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. మంగళవారం స్వామివారి పల్లకి సేవ కార్యక్రమానికి నెల్లూరు ధనుంజయరెడ్డి, పొబ్బారెడ్డి మల్లికార్జున్‌రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ నిర్మాణకర్తలు దండి సురేష్, తదితరులు ఉన్నారు.

## ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌లు పట్టివేత



**వరికుంటపాడు, సెప్టంబర్3, ప్రభాతవార్తః** అనుమతులు లేకుండ అక్రమంగ ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని పోలీసులుస్టేషన్‌కు తరలించారు. మండలంలోని గణేశ్వరాపురం గ్రామంవద్ద వున్న పిల్లాపేరువాగునుంచి అక్రమంగ ఇసుకను తరలిస్తున్నారని సామాచారంతో ఎఎస్ఐ శ్రీనాద్ ఆద్వర్యంలో పోలీసులు దాడులుచేసి వాగులోవున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో ఎవరైన అక్రమంగ ఇసుకను తరలిస్తున్న అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎఎస్ఐ హెచ్చరించారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ కృష్ణమోహన్, సిబ్బంది ప్రసాద్, సూర్యప్రతాప్, సుధాకర్ తదితరులువున్నారు.

## వీల్ చైర్ ఆస్పత్రికి వితరణచేస్తున్న ఎంపీటీసీ తిరుపతయ్య



**ఉదయగిరి, సెప్టెంబర్ 3, ప్రభాత వార్త:** ఎంపీటీసీ దాతృత్వంతో వీల్ చైర్ వితరణ ఇటీవల తన తల్లి గొల్లపల్లి నరసమ్మ ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసింది. ఆమె జ్ఞాపకార్ధం ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో డి డి ఓ డాక్టర్ అనూష ఆధ్వర్యంలో ఉదయగిరి బిట్ వన్‌ఎంపీటీసీ తిరుపతయ్య వీల్ చైర్ వితరణ చేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ నిర్మల, శివరామకృష్ణ వీల్ చైర్ స్వీకరించి దాతకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మాతృమూర్తి గొల్లపల్లి నరసమ్మ జ్ఞాపకార్ధంగా పేదలకు ఏదో ఒకటి చేయాలనుకుని ప్రభుత్వ వైద్యుల సూచనల మేరకు వీల్ చైర్ వితరణ చేశారు అన్నారు. ఇదే క్రమంలో ప్రతి సంవత్సరం పేదలకు దానధర్మాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ షంషీర్, ఏడు కొండలు ఆంజనేయులు, నానాజీ, గోవిందు, ప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి.




**ఉదయగిరి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:** ఆశా డే లో భాగంగా ఆశా కార్యకర్తలకు ప్రస్తుతం సీజన్లో ప్రభలేటువంటి డయేరియా, టైఫాయిడ్, కామెర్లు అతిసార, దోమ కాటు ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధుల పై ప్రజలకు అవగాహన కల్పించాలని గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ ఎం. శివ కల్పన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ప్రతిరోజు లార్వా మరియు జ్వరం కేసుల సర్వే నిర్వహించి జ్వరం కేసులను గుర్తించిన వెంటనే వారి వివరాలను ఏఎన్ఎం మరియు మగ ఆరోగ్య సహాయకులకు తెలియజేయాలి వారు వారి నుంచి రక్తపుపూతలు సేకరించవలెనని, వారికి అందుబాటులో ఉన్న చికిత్సను అందించాలని తెలియజేశారు. ప్రతి ఎం.ఎల్.హెచ్.పి డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు విలేజ హెల్త్ క్లినిక్ లో తప్పనిసరిగా నిర్వహించాలని తెలియజేశారు. ఆశా కార్యకర్తలు వారికి కేటాయించిన ఆన్లైన్ యాపులు ప్రతిరోజు అప్డేట్ చేయాలని తెలియజేశారు. ఈ నెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరిగే పోషకాహార వారోత్సవాలలో భాగంగా ప్రతి గర్భవతి, బాలతింత, కౌమార బాలికలకు పోషకాహార ఆశ్యకత గురించి అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఈ నెల 17 తేదీ నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి పాఠశాలలు, కళాశాలలో ఉండే ఆరు నెలల నుంచి 19 సంవత్సరాల వరకు ఉండే బాల, బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని దానికి సంబంధించి అంగన్వాడి, స్కూలు వారి ప్రణాళికలు సిద్దం చేసుకోవాలని సూచించారు. గర్భవతులకు, బాలింతలకు వారికి అందించవలసిన సేవలను వారి ఇంటి వద్దకే అందించాలని, ఇరిస్కు గర్భవతులను తగు పరీక్ష నిమిత్తము ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో పరీక్షలు నిర్వహజంచే విధంగా ఆశా కార్యకర్తలు వారి వెంట వెళ్లి కానుపోయిన వెంటనే వారిని ఇంటికి చేర్చాలని తెలియజేశారు. సి.హెచ్.ఓ సి హెచ్ శివకుమారి, ఆరోగ్య విద్యాధికారి కలసపాటి వెంకటసుబ్బయ్య, ఉదయగిరి సబ్ యూనిట్ అధికారి ఎస్.జి.నౌషద్ బాబు టీబి ఆర్గనైజింగ్ సూపర్వైజర్, బి.వెంకటేశ్వర్లు, పర్యవేక్షకులు వై.చెన్నయ్య, టి.అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పేదల కోసం కార్పోరేట్ స్థాయి విద్యను అందిస్తున్న కరుణామయి



**రాపూరు, సెప్టంబరు3ప్రభాతవార్త** మారుమూల ప్రాంతమైన రాపూరు, గోనుపల్లి వంటి ప్రాంతాలలో వున్న నిరుపేద విద్యార్ధులకు కార్పోరేట్‌స్థాయి విద్యను ఉచితంగా అందించేందుకు కరుణామయి విద్యాలయాలను భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీదేవి నెలకోల్పడం జరిగిందని పెంచలకోనలోని శ్రీ మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమ నిర్వాహకుడు పులిపాటి విజయ్‌భరత్ తెలిపారు. మంగళవారం రాపూరులోని శ్రీ కరుణామయి విద్యాలయంలోని 400 మంది విద్యార్ధులకుఆయన అమ్మ భక్తులు అయిన ఉషమ్మ, ఉమా గార్లతో కలసి స్కూల్ బ్యాగ్‌లు, యూనీఫామ్, బెల్ట్‌లు, షూష్, డైరిలుపంపిణీ చేశారు. పేదలకు మంచి నాణ్యమైన విద్యను అందించాలన్న సదుద్దేశంతో అమ్మ ప్రారంబించిన ఈ పాఠశాలల్లోవిద్యార్ధులకు ఉచితంగా నాణ్యమైన విద్యతో పాటు వారికి అవసరమైన విద్యాసామాగ్రిని కూడా ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి విద్యార్థి ఇష్టంతో చదివి మంచి పలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయనకోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ వెంకటరాముడు, ప్రధానోపాధ్యాయుడు పి.శంకరయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

## విద్యార్ధులు కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరాలి



**గోనువల్లి(రాపూరు) ,సెప్టంబరు3 ప్రభాతవార్త** విద్యార్ధులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పెంచలకోనలో ని మాతృ దేవి విశ్వశాంతి అశ్రమనిర్వాహకులు పులిపాటి విజయ్ భరత్ తెలిపారు. గోనుపల్లిలోని శ్రీ కరుణామయి విద్యాలయం లో మంగళవారం ఆయన విద్యార్ధులకు విద్యాసామాగ్రిణీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన ఇక్కడ కార్పోరేట్ స్థాయి పాఠశాలను నెలకోలిపి నిపుణులైన ఆధ్యాపకులచే విద్యార్ధులకు మంచి విద్యను ఉచితంగా శ్రీ కరుణామయి అశ్రమ వ్యవస్థాపకురాలు భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి అందిస్తుందన్నారు. ప్రతి విద్యార్ధికష్టపడి చదివి మంచి పలితాలను సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోని అమ్మ అశయాలను నెరవేర్చాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్ధులకు యూనీఫామ్, బ్యాగ్‌లు, షూష్, బెల్ట్, డైరీలను విద్యార్ధు లకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మస్తాన్ రావు, పాఠశాల ఇన్‌చార్జ్ వెంకటరాముడు, అమ్మ భక్తులు ఉషమ్మ, ఉమాలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్ధులు పాల్గోన్నారు.

## విద్యార్ధులకు స్వీట్లు పంపిణి



**వరికుంటపాడు, సెప్టంబర్3, ప్రభాతవార్తః** ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదినాన్ని పురష్కరించుకొని మండలంలోని పాఠశాలల విద్యార్ధు లకు జనసేన నేతలు తెలుగుదేశం పార్టీ నేతలు మంగళవారం స్వీట్లు పంపిణిచేశారు. జనసేన మండలపార్టీ అధ్యక్షుడు రసూల్ ఫఠాన్ ఆద్వర్యంలో వరికుంటపాడు, జడదేవి, కాకుల్లవారిపల్లి, హుస్సేన్‌నగర్, తిమ్మారెడ్డిపల్లి వేంపాడు, విరువూరు, కొండాయపాళెం, దర్మవరం, పెద్దిరెడ్డిపల్లి, కనియంపాడు, రామదేవులపాడు గ్రమాలలో వున్న పాఠశాలల విద్యార్ధులకు స్వీట్లను పంచిపెట్టి ఆనందాన్ని వ్యక్తంచేశారు. ఈసందర్భంగ ఆయన మాట్లాడుతు సోమవారం పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగ స్వీట్లు అందించాలని ఉద్దేశ్యంతో జనసైనికులు ముందుకురాగ సోమవారం పాఠశాలలకు సెలవు కావడం నేడు విద్యార్ధులకు ఆస్వీట్లు పంచామని చెప్పారు. పెద్దిరెడ్డిపల్లి ఉన్నతపాఠశాలలో జనసేననేత దగ్గుమాటి రవి, శివాజి, టిడిపి యూనిట్ ఇన్‌చార్జ్ నాదేండ్ల నాగేంద్ర, ఎస్ఎమ్‌సి చైర్మన్ నాగం చిననాయబ్‌రసూల్ ఆద్వర్యంలో స్వీట్లు పంపిణిచేశారు.

## సబ్సిడిపై మినుము విత్తనాలు



**వరికుంటపాడు, సెప్టంబర్3, ప్రభాతవార్తః** మినుముసాగుకు సన్నద్ధంగ వున్న రైతులకు 30శాతం సబ్సిడితో విత్తనాలు అందుబాటులో వున్నాయనిమండల వ్యవసాదాదికారి వి రవికుమార్ తెలిపాడు. పల్లాకు తెగులును తట్టుకొని అదిక దిగుబడినిచ్చే విబిఎన్-8రకాన్ని రైతుల కోరిక మేరకుతీసుకొచ్చామని ఈరకం పంట కోతదశలో వున్నపుడు వర్షాలకు కాయ తడిచినప్పటికి గింజలు నేల రాలకుండ, మొలకెత్తకుండ ఉండే లక్షణాలనుకలిగి వుంటాయన్నారు. ఒకకేజి మినుము విత్తనాల ధర 140రూపాయలు కాగ 30శాతం సబ్సిడితో 98 రూపాయలకే రైతులకు అందిస్తామన్నారుఒక రైతుకు గరిష్టంగ 5ఎకరాలకు సరిపడు విత్తనాలు పొందవచ్చని కావున విత్తనాలు కావలసిన రైతులు ఆయా రైతు సేవాకేంద్రాలలోనిగ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని ఆయన తెలిపాడు.

## నిర్దేశించిన వేళలు తప్పక పాటించాలి



**కోవూరు , సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న కార్డుదారులకు ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేసే వారు ప్రభుత్వం నిర్దేశించిన వేళలు తప్పక పాటించాలని తహసీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. కోవూరులోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న రేషన్ పంపిణీని మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డుదారులకు ప్రభుత్వం సూచించిన మేరకు బియ్యం , పంచదార తప్పక పంపిణీ చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో కార్డుదారులకు సరుకులు పంపిణీ కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

## మంచి పోషకాహారం ద్వారా త్వరితగతిన ఎదుగుదల



**రావూరు, సెప్టంబరు3ప్రభాతవార్త** మంచి పోషకాహారం తీసుకోవడం ద్వారా బిడ్డల ఎదుగుదల బావుంటుందని గోనుపల్లి సెక్టార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ తెలిపారు. పోషకాహార మాసోత్సవాల సందర్భంగా మంగళవారం ఆమె గోనుపల్లిలోని అంగన్‌వాడీ సెంటర్ 1లో జరిగిన పౌష్టికాహార మాసోత్సవాలలో పాల్గోని మంచి పోషకాహారం తీసుకోవడం ద్వారా చేకూరే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్త, గర్భవతులు, బాలింతలు, చిన్నారులు తదితరులున్నారు.

## 17 ఏ.పి.ఈ.జే.యూ జిల్లా నూతన కమిటి ఎన్నికలు




**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏ.పి.ఈ.జే.యూ). నెల్లూరు జిల్లా 4వ మహా సభ సెప్టెంబర్ 17వ తేదీ స్థానిక శ్రీ రేబాల లక్ష్మీనరసింహా రెడ్డి(జూనియర్)ఏసీ సమావేశ మందిరం, టౌన్‌హాలు ప్రాంగణం నెల్లూరులో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించున్నట్లు శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఉడత రామకృష్ణ తెలిపారు. నగరంలో స్థానిక మహబూబ్ ఖాన్ పార్కులోని ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ కన్వీనర్ మేకపాటి మాల్యాద్రి, రాష్ట్ర కో-కన్వీనర్ గట్టుపల్లి శివకుమార్ ల ఆదేశాల మేరకు ఈ మహాసభలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఎడిటర్లు, జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు ,ఫోటో, వీడియో జర్నలిస్టులు యూనియన్ లకు అతీతంగా పాల్గొని మహాసభను జయప్రదం చేయవలసిందింగా పిలుపునిచ్చారు. మా ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్ యూనియన్(ఏ.పి.ఈ.జే.యూ) లో చేరబోవువారు మహాసభకు ముందుగా నిర్వహించు సభ్యత నమోదు కార్యక్రమంలో పాల్గొని సభ్యత్వాలు పొందవలసిందిగా కోరారు. అదే రోజు మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్ యూనియన్ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నూతన జయప్రదం చేయవలసిందిగా అధ్యక్షులు ఉడతా రామకృష్ణ పిలుపునిచ్చారు. రాష్ట్ర కో-కన్వీనర్ గట్టుపల్లి శివకుమార్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు వెలసరి కుమార్, రాష్ట్ర నాయకులు పిజే రమేష్ రెడ్డి, ఎస్ డి జావిద్, జిల్లా నాయకులు సరళమ్మ, డి.వరప్రసాద్, ఎస్.కే.రిజ్వాన్, కే.ఉదయ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు , సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు.

# గంజాయిని పూర్తి స్థాయిలో అరికట్టలేని పోలీసులు

**కావలి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త** కావలి ప్రాంతంలో గంజాయి, ట్రెడాల్ మాత్రల్ని అరికట్టడంలో పోలీసులు వైఫల్యం చెందారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరో చెబితే కాని పట్టుకునే పరిస్థితులలో పోలీసులు వున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కావలి పట్టణంలోని పలు ప్రాంతాలలో గంజాయి, ట్రెడాల్ మాత్రలకు యువత బానిసైంది. ఎంతో మంది ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు గంజాయికి బానిసలయ్యారు. గంజాయిని పూర్తి స్థాయిలో నిరోధించాలని ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు వున్నాయి. ఒక్కసారి గంజాయి పట్టుబడితే మూలాలు ఎక్కడ వున్నాయో పరిశోధించి, వెతికి పోలీసులు అరికట్టాల్సి వుంది. గంజాయి జోలికి వెళితే ఎటువంటి కఠిన శిక్షలు వుంటాయో అన్న భయాన్ని కూడా పోలీసులు కల్పించకపోవడంతో కావలిలో గంజాయి వాసనలు వస్తున్నాయి. కావలి పట్టణ గాయత్రినగర్‌లో షబ్బీర్ అనే యువకుడు, పాతవూరుకు చెందిన పాతకొట్టు రాజశేఖర్‌రెడ్డిలను వన్‌టౌన్ సిఐ యం.డి.ఫిరోజ్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. వారి వద్ద నుండి దాదాపు 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కావలి పట్టణాన్ని గంజాయి మాఫియా చుట్టుముట్టిందన్న ప్రచారం లేకపోలేదు. పలు కళాశాలల వద్ద చిన్నచిన్న బంకులలో, జనసంచారం లేని ప్రాంతాలలో గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇదిలా వుంటే ట్రెడాల్ మాత్రలను డిస్టలరీ వాటర్‌తో కలిపి నరానికి ఇంజక్షన్ వేసుకుంటున్నారు. ఇటీవల టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మత్తుపదార్ధాలకు బానిసలైన యువకులు ఐదారు మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని కొన్ని రోజుల పాటు విచారించడం కూడా జరిగింది. ఆ కేసు ఏమైందో పోలీసులు నేటికీ బహిరంగపర్చకపోవడం గమనార్హం. విశాఖపట్నం నుంచి గంజాయిని తీసుకొచ్చి కొంతమంది అమ్మకాలు సాగిస్తున్నారు. చిన్నచిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తుంటారు. కొంతమంది సిగిరెట్లలో వాడుతున్నారు. ఇటీవల ఎన్నికలలో ప్రచారానికి వెళ్లిన ప్రస్తుత ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి ఎంతోమంది మహిళలు గంజాయికి తమ బిడ్డలు బానిసలవుతున్నారని, గంజాయిని అరికట్టి తమ బిడ్డల్ని కాపాడాలంటూ వేడుకోవడం జరిగింది. ఆ మహిళలకు ఎమ్మెల్యే కావ్య హామీ ఇచ్చారు. గంజాయిని పూర్తి స్థాయిలో అరికడతానని చెప్పడం కూడా జరిగింది. దీనిని బట్టి చూస్తే కావలిలో గంజాయి ఏ మేరకు విక్రయాలు జరుగుతున్నాయో అర్ధమవుతుంది. ఇప్పటికైనా కావలి పోలీసులు గంజాయి సరఫరా మూలాలపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా వుంది. గంజాయి విక్రయదారులు పట్టుబడితే కఠిన శిక్షలు వేయాలని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఇటీవల పోలీసులకు ఆదేశాలు కూడా ఇవ్వడం జరిగింది. మత్తుకు బానిసలైన వారిపై కూడా కఠిన శిక్షలు అమలు చేయాల్సి వుంది.

## ప్రవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు సన్మానం



**బుచ్చి సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో అపస్మా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు నేలనూతల శ్రీదర్ మాట్లాడుతు సెప్టెంబర్ 5 వ తేది జరిగే ఉపాధ్యాయ దినోత్సవం జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలలో అపస్మా ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. 350 మంది పాఠశాల ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ప్రవేటు పాఠశాలలో ఉత్తమ శిక్షణ అందిస్తున్న ప్రవేటు పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించుకోవడం మాకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈనెల 5 వ తేది ఆత్మకూరులో, 14 వ తేది నెల్లూరులో, 15 వ తేది రాపూర్ డివిజన్‌లో, 16 వ తేది ఉదయగిరి డివిజన్‌లో, ఉత్తమ ఉపాధ్యాయ సన్మాన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో బుచ్చిరెడ్డిపాళెం అధ్యక్షులు అయుబ్‌ఖాన్ మాట్లాడుతు కోవూరులో జరిగే కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం లోని 13 పాఠశాలల నుండి 30 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించుకోవడం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, పాల్గొంటారని వారు తెలిపారు. ఈ సమావేశంలో గిరి, ఎన్‌జిఎస్ స్కూల్ కరస్పాండెంట్ మన్సూర్, విశ్వభారతి స్కూల్ కరస్పాండెంట్ తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు కోటి రూపాయిల సాయం అందించిన వేమిరెడ్డి దంపతులు సిఎం చంద్రబాబుకి చెక్కు అందించిన వేమిరెడ్డి దంపతులు



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు కోటి రూపాయల భారీ విరాళం అందించారు. వరదలతో తీవ్రంగా నష్టపోయిన వారికి సహాయ సహకారాలు అందించేందుకు, వారిని ఆదుకునేందుకు కోటి రూపాయిలను విరాళం అందించారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి కోటి రూపాయిలు చెక్కును అందించారు. ఇటీవల వచ్చిన వరదలతో విజయవాడ తీవ్రంగా నష్టపోయింది. వేలాది మంది ప్రజలు తిండి, నీరు లేక అల్లాడిపోయారు. ఇప్పటికీ పలు కాలనీలు జలదిగ్భంధంలో ఉండిపోయాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే దగ్గరుండి సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. అన్నార్తులు ఆకలితో అలమటిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరదలతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డ ప్రజల సహాయార్థం, వారి బాగోగుల కోసం ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు కోటి రూపాయలను విరాళంగా అందించి మానవత్వం చాటుకున్నారు. విపత్తు నుంచి ప్రజలు త్వరగా బయటపడాలని ఆయన ఆకాంక్షించారు. రూ. కోటి రూపాయిలు అందించిన వేమిరెడ్డి దంపతులను వరద బాధితులను ఆదుకునేందుకు స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బాధితులకు అండగా నిలుస్తున్న ఆయనకు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతిరాజ్ డిపార్ట్‌మెంటుకు వన్నెతెచ్చిన ఇఇ రవికుమార్



**కావలిరూరల్, సెప్టంబర్3, ప్రభాతవార్తః**పంచాయతిరాజ్ డిపార్ట్‌మెంటులో ఎఇ. డిఇ. ఇఇగ 39సంవత్సరాలు ఉన్నతాదికారులు సహ ఉద్యోగులమన్ననలనుపొంది పంచాయతిరాజ్ డిపార్ట్‌మెంటుకు వన్నెతెచ్చిన కావలి డివిజినల్ పంచాయతిరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆలూరు జోషప్‌రవికుమార్ అని కావలి శాసనసభ్యులు దగ్గుమాటి వెంకటకృష్టారెడ్డి తెలిపారు. ఆలూరు జోషఫ్ రవికుమార్ పదవి విరమణ సందర్భంగ కావలి గొట్టిపాటి కొండపనాయుడు కళ్యాణమండపంనందు పదవి విరమణ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగ ఎంఎల్‌ఎదగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొని ఎఇ రవికుమార్‌కు పుష్పగుచ్చానందజేసి దుశ్శాలువాతో ఘనంగ సత్కరించారు. ఈసందర్భంగ ఆయన మాట్లాడారు. ఇఇ రవికుమార్ ఎఇగ తన ఉద్యోగ ప్రస్తానాన్ని కావలిలో ప్రారంభించి కావలిలోనే డిఇగ, ఇఇగ 35ఏళ్ళు విశిష్ట సేవలందించి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గ కావలిలో పదవీవిరమణ చేయడం అంత ఆషామాషీ కాదని దీనికి ఆయన నిభద్దత మంచితనమే కారణమని అన్నారుఅందరికి మంచి మిత్రుడిగ మెలిగాడని చెప్పారు. ఎవరు ఫోన్ చేసిన ఎపుడు పోన్‌చేసిన స్పందించే మనస్తత్వం పాజిటివ్‌గ మాట్లాడే మనస్తత్వంఆయన దన్నారు. ఆయన బాపట్లలో జన్మించిన కావలి ఆయనకు స్వంత ఊరుకంటే ఎక్కువని బాపట్లలో ఆయనకు తెలిసినా తెలియక పోయినకావలిలో ఆయనకు తెలియని వారుండరన్నారు. ఆయన అందరి వాడిగ అన్ని పార్టీల వాడిగ మన్ననలను పొందారన్నారు. నేను ఎంఎల్‌ఎఅయిన అనంతరం రవికుమార్ రిటైర్ కావడం చాలా భాదాకరమని తెలిపాడు. కావలి డివిజన్‌లో ఎనలేని సేవలుచేసినందుకు ప్రత్యేకంగ అభినందిస్తున్నానన్నారు. ఉన్నతమైన విలువలతో ఉద్యోగ భాధ్యతలు నెరవేర్చి ఓర్పు సహనంతో అందరి అభిమానాన్ని పొందారన్నారు. ఒక వ్యక్తికిముఖ్యంగ నాలుగు గోల్స్ వుండాలని ప్రొఫెషనల్ గోల్స్, సోషల్‌గోల్, ఫ్యామిటిగోల్, రలీజన్‌గోల్ ఈనాలుగు ఇఇ రవికుమార్‌కు ఉన్నాయన్నారుఅనంతరం ఇఇ ఎఇ రవికుమార్ మట్లాడారు ఆలూరి జోషఫ్ కావలి ప్రజల ఆదరాభిమానాలు మరువలేనివని వారి అభిమానంతో ఎఇగ, డిఇగఇఇగ పలు హోదాలలో కావలిలో ఉద్యోగ భాధ్యతలు నిర్వహించి పదవి విరమణ చేయడం సంతోషకరమన్నారు. నామీద ఎంతో అభిమానం చూపిన పంచాయతిరాజ్ ఉద్యోగులు ఆదరణ మరువలేనిదన్నారు. వారికి ఎల్లవేళల రుణపడివుంటు నావంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతిరాజ్ ఎస్ఇ పి ఆశోక్‌కుమార్, విశ్రాంత ఇఇ గోపినాద్, డిఇ సాయికిషోర్, డిఇ సుబ్బరాజు, ఇఇ వేణుగోపాల్, విశ్రంత ఎస్ఇ చంద్రశేఖర్, విశ్రాంత ఎస్ఇ కొండయ్య, విశ్రాంత ఇఇ ముత్యం బాబు, ఇఇ కోటేశ్వరరావు, విశ్రాంత డిఇ జాన్‌సన్ విశ్రాంత ఇఇ కాంతారావు, రాష్ట్ర పిర్ ఆసోషియేషన్ కార్యదర్శి సంగీతరావు, క్వాలిటి కంట్రోల్ ఇఇ అశోక్, ఇఇ రియాజ్, డిఇ వెంకటేశ్వర్లు, డిఇ విశ్వేశ్వరరావువిశ్రాంత ఎఇ గోపికృష్ణ, మరియు పంచాయతిరాజ్ సిబ్బంది ఎఇ రవికుమార్ కుటుంభ సభ్యులు బంధు మిత్రులు సన్నిహితులు శ్రేయోభిలాషులుపాల్గొని ఎఇ రవికుమార్‌ని దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగ సత్కరించారు.

## నగరంలో దారుణ హత్య



**నెల్లూరు క్రైం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలో వరుసగా జరుగుతున్న హత్యలతో నగరవాసుల్లో భయాందోళన నెలకొంది. వారం రోజుల కిందట బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రామలింగాపురం వద్ద రవి అనే రౌడీ షీటర్ హత్యకు గురైన సంఘటన మరువకముందే ఇదే ప్రాంతానికి సమీపంలో ఉన్న ముత్యాలపాలెంలో సోమవారం అర్ధరాత్రి ఎం. పాల్ అనే వ్యక్తిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన సంబంధించిన వివరాల్లోకి వెళ్లితే విడవలూరు మండలం చెన్నరాయుని పాలెంకు చెందిన పాల్ (35)కు ముగ్గురు భార్యలు, మూడో భార్య అయిన కవితతో కలిసి గత కొంతకాలంగా స్థానిక ముత్యాలపాలెంలో అతను నివసిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి పాల్ పై విచక్షణారహితంగా కత్తులతో దాడి చేసి హతమార్చారు. పాలుకు బిట్రగుంటకు చెందిన కొందరు రౌడీషీటర్లతో పాత విభేదాలు ఉన్నట్లు తెలిసింది. ఆర్థిక లావాదేవీల కారణంగా హత్య జరిగినట్లు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఒరెండు రోజుల కిందట కూడా బిట్రగుంటకు చెందిన వారు పాల్ పై దాడి చేసినట్లు సమాచారం. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న బాలాజీ నగర్ సిఐ సాంబశివరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## జనసేన నాయకుడు సిద్దులో ఒక భగత్‌సింగ్‌ను చూస్తున్న



**కావలిరూరల్, సెప్టంబర్3, ప్రభాతవార్తః** కావలి జనసేన నాయకుడు సిద్దు క్రమశిక్షణకు ఫిదా అయ్యానని ఆయనలో ఒక భగత్‌సింగ్‌ను చూస్తున్నాని కావలి ఎంఎల్ఎ దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపాడు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి జనసేనపార్టీ అధినేత కొణెదల పవన్‌కళ్యాణ్‌జన్మదినం సందర్భంగ సిద్దు ఆధ్వర్యంలో కావలి ఉదయగిరి బ్రిడ్జి ఎంటర్‌నందు పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదిగ విచ్చేసిన ఎంఎల్ఎ జన్మదిన బారీ కేక్‌ను కట్‌చేశారు. ఈసందర్భంగ ఆయన మాట్లాడుతు యువతను చైతన్యంపరుస్తున్న వారికోసం పరితపిస్తున్న జనసేన యువనాయకుడు సిద్దులో స్వాతంత్ర్యంకోసం పోరాడిన భగత్‌సింగ్ కనిపిస్తున్నాడని శ్లాఘించాడుసిద్దు చిన్నవయస్సునుంచే మంచి భావాలు పుణికిపుచ్చుకొని సమాజంలో తనకంటు ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడన్నారు. సిద్దు ఎప్పటికైన రాజకియాలలో ఉన్నతస్తాయిలో వుండాలని ఆశాభావం వ్యక్తంచేశారు. కాని భావాలువేరు జీవితంవేరని తను నమ్ముకున్న కుటుంబంకోసం అనుచరులకోసం కొంతసమయం వెచ్చించాలని సూసించారు. కేవలం రాజకియిలలో కాకుండ వ్యాపారాలపైకూడా సిద్దు దృష్టిపెట్టాలని సలహాఇచ్చారు. రాష్ట్రంలో రక్షసపాలన అంతమొందించేందుకు కొణిదల పవన్‌కళ్యాణ్ ఎంతో కృషిచేశారని అన్నారు. పవన్‌కళ్యాణ్ సినిమాలలోనే కాకుండరాజకీయ జీవితంలోకూడ ఎంతో హూందాగ వ్యవహరించి అందరి మన్ననలను పొందారన్నారు. గతంలో వున్న ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకుగురిచేసిన పోరాటంచేసిన మహోన్నతవ్యక్తి పవన్‌కళ్యానని అన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకుట్టుకున్నాయి . ఈసందర్భంగ సిద్దు ఆధ్వర్యంలో కావలి పట్టణంలోని భాష్యం స్కూల్‌నుంచి బృందావనం కలనీవరకు బైక్‌ర్యాలి జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, కావలి నియోజకవర్గ టిడిపి లీగల్‌సెల్ అధ్యక్షుడు గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరిపట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుత్తికొండ కిషోర్‌బాబు, జ్యోతి బాబురావు, కావలి మండల ప్రదానకార్యదర్శి ఉప్పాల వెంకట్‌రావు, జనసేననేతలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## జనసైనికుల చొరవ స్ఫూర్తిదాయకం



**కోవూరు , సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గంకు చెందిన జనసేన నాయకులు , కార్యకర్తలు ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రికి రక్తదానం అందించడం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ మేరకు ఆమె మంగళవారం మాట్లాడుతూ కోవూరు నియోజకవరనగ జనసేన నాయకులు సీహెచ్ శ్రీనివాసులురెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకుని 42 యూనిట్ల రక్తాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి అందజేయడం శుభపరిణామం అన్నారు. మొట్టమొదటి సారిగా కోవూరులో ప్రభుత్వ ఆస్పత్రికి జనసైనికులే రక్తదానం చేశారని, ఈ సందర్భంగా వారందరినీ ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగిస్తూ ఆస్పత్రి అభివృద్ధికి కూడా సహకరించాలని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వెంకటాచలపతి గౌడ్, డాక్టర్ మైనుద్దీన్, హెడ్ నర్స్ ప్రసూన లత, స్టాఫ్ నర్స్ తదితరులు ఉన్నారు.

## మొక్కని నాటండి పర్యావరణాన్ని కాపాడండి



**నెల్లూరు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త- వైద్యం :** ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని కాపాడాలని విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ వి. విజయన్ అన్నారు. మంగళవారం నగరంలోని విద్యుత్ భవన్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల సూచనల మేరకు వనమహోత్సవంలో భాగంగా అమ్మ పేరుతో విజయ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా అమ్మ పేరు మీద మొక్కలు నాటాలని, సుజలం, సుఫలం, మలయజ శీతలం, సస్యశ్యామలం అన్న మాటను వివరిస్తూ భరతమాతకు, తెలుగు తల్లికి నమస్కారం చేసిన వారమవుతామని అన్నారు. వాతావరణంలో సమతుల్యం లేప్పుడు ఏకైక మార్గం మొక్కలు నాటడం అని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షించాలని చెప్పారు. అమ్మ పేరుతో మొక్కలు నాటుతున్నారని ఇంది ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని డివిజన్లో మొక్కలు నాటాలని ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్ సోమశేఖర్‌రెడ్డి, రమేష్ చౌదరి, నరేంద్రరెడ్డి, బెనర్జి, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నరసింహారావు, అల్తాఫ్, ట్రేడ్ యూనియన్ నాయకులు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

## పాత మున్సిఫల్ భవన నిర్మాణం పనులు ప్రారంభం



**బుచ్చి సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీ పాత కార్యాలయం పగలగొట్టి దాని స్థానంలో కొత్త భవనం నిర్మాణం చేసేందుకు గత రెండు సంవత్సరాల క్రితం శ్రీకారం చుట్టారు. అయితే కొన్ని బాలారిష్టాల వల్ల ఆ నిర్మాణం బేస్‌మట్టాలకే పరిమితమైంది. అయితే కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఈవిషయాన్ని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకొని వెళ్ళి భవన నిర్మాణాం పనులకు మరలా శ్రీకారం చుట్టారు. ముళ్ళ పొదలు తొలగించి భవన నిర్మాణం ప్రాంగణం మొత్తం శుభ్రం చేయించారు. ఎమ్మెల్యే భూమి పూజ చేస్తే వెంటనే పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## వరద సహాయ చర్యల్లో సంగం రెవిన్యూ సిబ్బంది



**సంగం సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాలలో సంగం తహసిల్దారు సోమ్లానాయక్ విఆం ˆఒలు పాల్గొన్నారు. విజయవాడ లో వరద బాధితుల సహాయార్ధం గన్నవరం ఎయిర్‌పోర్టు నుండి వరద ప్రభావిత ప్రాంతాలకు నిత్యా వసర సరుకులు పంపిణి చేస్తున్న కార్యక్ర మంలో తహసిల్దారు సోమ్లానాయక్, విఆం ఒలు నాయబ్‌రసూల్, శ్రీనివాసులు రెడ్డి ,శోభ న్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ మెంబర్‌గా తాళ్ళ స్వామి



**బుచ్చి సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెంకి చెందిన తెలుగుదేశం సీనియర్ నాయకులు తాళ్ళ నరసింహస్వామిని ఇండియన్ రెడ్‌క్రాస్‌లో లైఫ్ మెంబర్‌గా ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రజలందరికి రక్తదానం వల్ల జరిగే మంచి గురించి తెలియజేస్తానని, బుచ్చిరెడ్డిపాళెం పరిధిలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయిస్తానని హామి ఇచ్చారు. నాయకులు, యువకులు ఏదైనా ఫంక్షన్‌ల సమయంలో ఎక్కువగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మేలు చేయాలని ఆయన కోరారు.

## సైదాపురం పోలీసు స్టేషన్ తనిఖీ



**సైదాపురం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన సైదాపురంలో ఉన్న పోలీసు స్టేషన్‌ను ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ చుట్టు పక్కల పరిసరాలను పరిశీలించారు. అలాగే స్టేషన్‌లో ఉన్న పలు రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలను ఎస్సై ఎన్. కాంతికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా సైదాపురం పోలీసు స్టేషన్‌కు రావడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా రాబోవు వినాయకచవితి పండుగ సందర్భంగా ఎవరైనా గణేషుని విగ్రహాన్ని పెట్టాలంటే వారు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా అనుమతులు కొరకు అప్లై చేసుకోవాలని తెలిపారు. దీంతో ఆ స్టేషన్ పరిధిలో ఉన్న ఎస్సైకు అనుమతులకు సంబంధించిన వివరాలు రావడం జరుగుతుందని, ఆయన ఏరియాకు సంబంధించి పంచాయతీ శాఖ, వైద్య సిబ్బంది, విద్యుత్ అధికారులకు సమాచారం అందించి గణేష్ విగ్రహ ఏర్పాటుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరిశీలించి అనంతరం అనుమతులు ఇవ్వడం జరుగుతుందని డీఎస్పీ వేణుగోపాల్ తెలిపారు.

## ఇందుకూరుపేట మండలంలో ని చెరువులకు నీటిని విడుదల చేయ్యాలి



**నెల్లూరు అర్బన్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** ఇందుకూరు పేట మండలంలోని పలుగ్రామాల్లోని చెరువులకు తక్షణం జాఫర్ సాహెబ్ కాలువ ద్వారా నీటిని విడుదల చేయ్యాలని రైతు సంఘాల సమాఖ్య అధ్యక్ష్య కార్యదˇర్శులు కోటిరెడ్డి, పి. కృష్ణచైతన్యలు కోరారు. ఈ మేరకు వితని పత్రాన్ని మంగళ ˇవారం నగరంలోని స్దానిక కలెక్టర్ కార్యలయంలో జిల్లా రెవెన్యూ అధికారి లవన్నకి అందజేశారు. ఈ సందర్భంగా సమాఖ్య నాయకులు మాట్లాడుతు ఇందుకూరు పేట మండలంలోని గంగపట్నం , రాముడుపాలెం, నిడిముసిలి, కుడితిపాలెం, పల్లెపాడు, ఇందుకూరుపేట, మైపాడు, తదితర గ్రామల్లోని చెరువుల్లో వర్షాబావ పరిస్దితుల నేపద్యంలో నీరు పూర్తిగా అడుడంటిపోయ్యాయన్నారు. దీంతో ప్రజలకు, మూగ జీవాలకు తాగేందుకు మంచి నీరు కూడా కరువైందని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిని నివారించేందుకు సోమశిలలో, నెల్లూరు బ్యారేజీలో నిల్వ ఉన్న నీటి వనరులను వినియోగించి ఆయా గ్రామాల చెరువులను నింపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ఉపాధ్యక్షులు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్ధులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేసిన జనసేన నాయకులు



**గుడ్లూరు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** ఏపీ ఉప ముఖ్యమంత్రి వపన్‌కళ్యాణన పుట్టిన రోజును పురష్కరించుకుని గుడ్లూరు మండలం పోట్లూరు గ్రామంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన అధ్యక్షులు షేక్ రియాజ్, కందుకూరు నియోజకవర్గ జనసేన నాయకులు దేవళ్ళ భాస్కరరావు సూచనలు మేరకు స్ధానిక జనసేన నాయకులు ఆత్మకూరు సుధాకర్ సౌజన్యంతో మండల ప్రాథమిక పాఠశాల, ఎస్టీ కాలనీ పాఠశాలలో విద్యార్ధులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మూలగిరి శ్రీనివాస్ మాటాలడుతూ పవన్ కళ్యాణ్ ఆశయాలు, జనసేన సిద్దాంతాలలో భాగంగా ఆయన పుట్టిన రోజు పురష్కరించుకుని నిన్నటి రోజున స్కూల్ సెలవు ఉండటంతో స్ధానిక ఉపాధ్యాయులు ప్రోత్సాహంతో విద్యార్ధులకు ఎగ్జామ్ ప్యాడ్స్‌తో పాటు స్వీట్స్, చాక్లెట్లు కూడా పంపిణీ చేయడం జరిగిందన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పవన్ కళ్యాణ్ తాపత్రయం కూడా ఉత్తమ సమసమాజ స్థాపన లక్ష్యం, అలాంటి మంచి వ్యక్తి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని బాల హక్కులే బ్రహ్మ వాక్కులుగా ఉండటం కోసం విద్యార్ధులతో పవన్ కళ్యాణ్‌కి జన్మదిన శుభాకాంక్షలు చెప్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మెన్ కొండరాజు పార్వతి, గ్రామ పెద్దలు సాంబశివరావు, మండల జనసేన నాయకులు అన్నంగి చలపతి, అనిమిశెట్టి మాధవరావు, భైరవరపు రాజశేఖర్, కుంచాల అంకమరావు, గౌడపేరు శివాజీ, ఆలూరి హిమసాగర్, మద్దెల రమేష్, మద్దెల సాయి, మేకపోతుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితుల కోసం విజయవాడకు బయలుదేరిన రెండు టీమ్‌లు



**సైదాపురం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** తుఫాన్ బాధిత నగరమైన విజయవాడ పరిసర ప్రాంత ప్రజలకు సహాయం చేసేందుకు మండలం నుంచి రెండు టీమ్‌లు మంగళవారం బయలుదేరాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ మాట్లాడుతూ తుఫాన్ బాధితులకు సేవ చేసేందుకు జిల్లా కలెక్టర్, జడ్పీ సీఈఓ, డీపీఓ అధికారుల ఆదేశాల మేరకు సైదాపురం నుండి రెండు టీమ్‌లు విజయవాడకు బయల్దేరాయని తెలిపారు. ఒక్కోక్క టీమ్‌లో ఒక ఎలక్ట్రీషియన్, ఒక ప్లంబర్, ముగ్గురు శానిటేషన్ వర్కర్స్ ఉంటారని, వీరికి లీడర్‌గా పంచాయతీ కార్యదర్శులు వంశీకృష్ణ, కార్తీక్ వ్యవహారిస్తారని తెలిపారు. వీరు నాలుగు రోజుల పాటు సేవలు అందిస్తారని అన్నారు.

## సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం



**నెల్లూరు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త- వైద్యం :** నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు మంత్రి నారాయణ గతం లోనే నగరంలో పార్కులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలుగు దేశం పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కప్పిర శ్రీని వా సులు, మహిళా అధ్యక్షురాలు కప్పిన రేవతి తెలిపారు. మంగళవారం నగరంలోని రంగనా యకులపేట సమీపంలో ఉన్న పినాకిని పార్కులో జంగిల్ క్లినింగ్ కార్యక్రమంలో భాగంగా పార్కుని శ్రీనివాసులు, రేవతిలు ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పినాకిని పార్కు దగ్గర రంగనాయక స్వామి గుడి దగ్గర నుండి పొట్టేపాలెం వరకు జంగిల్ క్లినింగ్ చేయడం జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో కట్ట పోసి రిటర్నింగ్ కోడ కట్టి పెన్నా నది పక్కన వరద ముంపుకు గురి కాకుండా పేద ప్రజల కోసం మంత్రి నారాయణ మంచి ఉద్దేశంతో చేయడం జరుగుతుందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పినాకిని పార్కుని అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిపోయిందని వివరించారు. అంతకముందు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు నందనవనంగా ఉండాలని పార్కులు నిర్మించడం జరిగిందని చేశారు. వైసీపీ ప్రభుత్వం ఆ పార్కులను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం మరలా పార్కులను అన్ని హంగులతో తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టి మొదటగా జంగిల్ క్లినింగ్ మొదలు పెట్టారని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు జీతాలు పెంచాలి



**లింగసముద్రం(కందుకూరు), సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు లింగసముద్రం పీహెచ్‌సీ సెంటర్లో ఆశా వర్కర్స్ జీతాలు పెంచాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఫిబ్రవరి 9వ తేదీన ఆశా వర్కర్లు పరిష్కరిస్తానని గజిట్ నోట్లో పొందుపరిచింది. కానీ జీవోలు మాత్రం ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత దీనిపై స్పందన లేదు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని జీతాలు పెంచాలని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అనంతరం లింగసముద్రం పీహెచ్ సెంటర్‌లో ఉన్న సీహెచ్‌ఓ జి. శ్రీనివాసరావు, ఆశా సోషల్ ఆఫీసర్ క్షత్రియ కుమారికి వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని, 10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని, రిటైర్మెంట్ వయసు 62కు పెంచి బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా లీడర్ కాటా రవణమ్మ, జేవీ ప్రమీల, సీహెచ్ మణికుమారి, కే. శ్రీలక్ష్మీ, బి. విజయలక్ష్మీ, గీత తదితరులు పాల్గొన్నారు.